# "తప్పు"

శ్రీ ఏ. యస్వీ. రమణారావు



★

తెల్లారేసరికల్లా ఆ వార్త ఊరు ఊరంతా గుప్పుమంది! పేరుకి వూరేగాని లెక్కకి వెయ్యి గడపేనా లేని ఆ పల్లెలో ఆ వార్త అల్లుకోడం ఎంతసేపని! అసలా ఘోరం అంతా ఆ ఊరు సర్పంచ్ పెదనాయుడి కళ్ళంలోనే జరగటంవూ అది కాస్తా అతనికి ఎగస్పార్టీ అయిన చిననాయుడి కళ్ళల్లో పడటంవూతో ఆ వార్తకి ప్రాముఖ్యత మరీ హెచ్చయిపోయింది!

అసలింతకీ చిననాయుడి కళ్ళల్లో పడిందేమిటీ అంటే...

ఆ తెల్లారి తొలికోడి కూత వేళప్పుడు పడమటి కొండల్లోకి పచ్చట వెన్నెల వాలిపోతున్న సమయంలో అంతకంటే పచ్చగా మిసమిసలాడిపోయే మాలచ్చిమి చీరకుచ్చెళ్ళు సరిచేసుకుంటూ పెదనాయుడి కళ్ళంలోంచి చల్లగా జారిపోతూ!

"ఏటే లచ్చా ఈ ఏళప్పుడు ఇక్కడ నీకేటే పని?" జారిపోతున్న మాలచ్చిమిని వొడశేదు చిననాయుడు.

అడిగిన ప్రశ్నకీ అడిగినోడికీ చూసి బిత్తరపోయి సమాధానమివ్వటానికి తంగారు పడిపోయి తప్పుకు వెళ్ళిపోయిన మాలచ్చిమి మత్తు వొదలని వొళ్ళూ నిద్రతీరని కళ్ళూ వొత్తయిన జుట్టులో నలిగిపోయిన మల్లెపూల వాసనా చిననాయుడిని మరింత కలవరపెట్టేశాయి! అందుకే పొలం వెళ్తున్న వాడల్లా వెనక్కి తిరిగి వూళ్ళో కొచ్చి ఉప్పందించేసేడు! పెదనాయుడికి తల తీసినంత పనయింది!

మాలచ్చిమి బరితెగించి తన కళ్ళంలో జొరబడినందు కాదు! ఆ గుంట వెళ్ళి తిన్నగా చిననాయుడి కళ్ళల్లో పడినందుకు!

ఆ గుంటని పరాసరి తన కళ్ళానికే తెప్పించుకుని సరసం సాగించిన దొంగ నాకొడుకెవడో పసిగట్టేసరికి పెదనాయుడికి కోపంతో కళ్ళెర్రబారాయి. అసలే భీకరంగా వుండే పెదనాయుడిని కళ్ళెర్రబడితే మరి చూడలేం!

అంతే అరుగుమీద కూర్చున్నవాడు హఠాత్తుగా లేచి—

"ఆ సింహాద్రిగాడిని జుత్తట్టుకు ఈడ్చుకురారా" అని అక్కడున్న వో మనిషికి బెత్తాయించి మరో మనిషిని చిననాయుడు కళ్ళానికి తోలేసేడు.

కబురందుకున్న సింహాద్రి...కబురెళ్ళిందని మహాలక్ష్మి గతుక్కుమన్నారు!

ఊరంతా దండోరా వేయించాడు పెదనాయుడు. మాలచ్చిమీ సింహాద్రీ గతరాత్రి నీతితప్పి ప్రవర్తించినందుగ్గాను ఆ మజ్జాన్నం రచ్చబండ దగ్గర విచారణ జరపబడతుందనీ, దోషులకి తప్పు వెయ్యడం జరుగుతుందనీ ఆ వేడుక తిలకించడానికి ఊరు యావన్మందీ హాజరు కావాలనిన్నూ!

కబురందుకుని కళ్ళంనుంచి వచ్చిన చిననాయుడిని మరింటికెళ్ళనియ్యలేదు పెదనాయుడు. అప్పటికప్పుడు కోళ్ళని కోసి విందు చేసాడు. అబోదిబోమంటూ పెదనాయుడి కాళ్ళమీద పడిన సింహాద్రిని చిననాయుడు పక్కకి తీసుకెళ్ళి మంతనాలు జరిపేడు. ఆ మజ్జాన్నం వాడి భోజనంవూ పెదనాయుడిగారి కంచాలోనే!

ఇవేవీ తెలీని ఆ ఊరి పెద్దాపిన్నా త్వరత్వరగా పనులు ముగించేసుకుని రచ్చబండ దగ్గరకు బిలబిలపోగయ్యారు. ఊరి సర్పంజ్ పెదనాయుడు బోర్డుమెంబరు చిననాయుడూ తలపెద్ద అపిరయ్యతాత ఉచితాసనంమీద తతిమ్మా పెద్దలు సముచితాసనాలమీద కొలువుతీర్చారు. మిగతా ప్రజలంతా జరగబోయే రసవత్తర ఘట్టంకోసం కళ్ళప్పగించి చూస్తున్నారు. రచ్చబండ కచేరీ మొదలయ్యింది! ముందు ముద్దాయి మహాలక్ష్మి!

మాలచ్చిమి పెద్దల ముందొచ్చి తలొంచుకుని నిలిచి

యంగా నిలబడింది.

"నీ పేరు?" రివాజుగా అడిగాడు పెదనాయుడు.

"మాలచ్చి"

"నువ్వుండేది?"

"మాలగూడెం."

"నిన్న రేత్రి కోమటి సత్తెం కొట్టుమూసే యేలప్పుడు సీంహాద్రి మీ గూడెంలో కొచ్చాడనీ చూసినోళ్ళు సెప్తన్నరు నిజంవేనా?"

అవునన్నట్టు తలూపింది మాలచ్చి.

"ఆడు నీ గురించే వొచ్చాడనీ మీ గడపెనకాల నీతో మాటాడెళ్ళిపోయాడని ఇరుగు పొరుగు అంటున్నారు నిజంవేనా?"

మళ్ళీ తలూపింది మాలచ్చి.

"పెదనాయుడి కళ్ళంలో కోతపనికి సీంహాద్రేనా నిన్ను కుదిర్చింది?"

"నన్నేమిటి అందర్నీ కుదిర్సినాడు" మాలచ్చిగొంతు పెగిలింది.

"అడిగిందానికి సెప్పు. రాత్రి తొలికోడి కూసేళప్పుడు పెదనాయుడు కళ్ళంలోంచి వస్తున్న నిన్ను చిననాయుడు చూసానంటన్నడు నిజంవేనా?"

మళ్ళీ తలూపింది మాలచ్చిమి.

"చిన్నాయుడడిగిందానికి నువ్వు జవాబియ్యకుండా ఆ బాబుని సూసి కంగారుగా యెలిపోనావంటా నిజంవేనా?"

తలూపక తప్పలేదు మాలచ్మికి.

"ఇక నువ్వెల్లి ఆ మూలన్నిలబడు."

రెండో ముద్దాయి సింహాద్రి.

సింహాద్రొచ్చి చేతులు కట్టుకుని నిలబడ్డాడు పెద్దల ముందు.

"మాలచ్మిని నడిగినయన్నీ నువ్విన్నావా?"

"ఇన్నాను."

"మాలచ్మిని నువ్వు పిలగానే పెదనాయుడి కళ్ళంలో కొచ్చిందా రాత్రి?"

"వొచ్చింది."

"నువ్వెళ్ళి ఆ మూల నిలబడు" అంటూ విచారణ ముగించి పెదనాయుడు చిన్నాయుడి వేపు తతిమ్మా పెద్దలవేపూ చూసాడు. నలుగురు పెద్దలూ పెదనాయుడి దగ్గిర సాచేరేరు. అయిదు నిముషాలు వాళ్ళల్లో వాళ్ళు ఏవేవో మాట్లాడుకున్నారు. మళ్ళీ ఎవరి స్థానాల్లోకి వాళ్ళెళ్ళిపోయారు. తీర్పు యివ్వటానికి పెదనాయుడు గొంతు సవరించుకున్నాడు. ప్రజంతా ఊపిరి బిగించి చూస్తున్నారు.

"ఊరి పెద్దలారా ప్రజలారా ఇప్పుడు మీ ముందు జరిపిన ఇసారణవల్ల తేలిందేటంటే పెళ్ళి కాకుండా వొయసులో వున్న మాలచ్చిమి, పెళ్ళయి సంసారం సేసుకుంటున్న సీంహాద్రిని వొలలో ఏసుకుని పల్లిగ్గా మన



అమృతా ఫిలింస్ వారి
"ప్రేమ-పగ"
చిత్రంలో
ఎం. బాలయ్య, రూప.

ఎల్లప్పుడూ...
ఎమరాల్డ్ బనియన్లనే ఉపయోగించండి.




26, Stanes Rd., 4th St.,
TIRUPUR - 638602
Regd. No. 300188


ఊరి సర్పంచ్ పెదనాయుడి కళ్ళంలో నిన్న రాత్రి శివాద్రితో నీతి తప్పింది..."

అంతవరకూ తల దించుకునున్న మాలచ్చిమి వొక్కసారి విసురుగా తలెత్తి పెదనాయుడి మొహంలోకి సప్రశ్నగా చూసింది. పెదనాయుడు ఆ చూపు భరించలేక మొహం చాటు చేసుకుని మళ్ళీ తన తీర్పు కొనసాగించాడు.

"అంసేత బరితెగించి బజార్నపడిన మాలచ్చిమిలాటోళ్ళ నొగ్గస్తే శివాద్రిలాంటి ఎంతమంది సంసారుల్నయినా బజారుపాల్జెయ్యొచ్చు. అదీకాక వూళ్ళోవున్న వర్రకారు కూడా చెడిపోయే ప్రమాదంవుంది. అంసేత మాలచ్చిమి ఊరు పొలిమేరలొగ్గి వెళ్ళిపోవాలనీ లేదా అయిదొందల జరిమానా వున్న పళంగా వొకేసారి కట్టుకొని ఊరి మర్యాదకి కట్టుబడుండాలనీ తప్పు ఎయ్యడం అయింది! ఒక అద్దది వోఅలో ఎనుకున్నంత మాత్రం సేత దాని వొళ్లో వొడిపోయి సంసారం వొగ్గిని దానెంటబడిన శివాద్రికి ఏబయిరూపాయిలు జరిమానా ఏస్తూ ఇకముందు బుద్ధిగుండాలని తప్పు ఎయ్యడం అయింది!" అంటూ తీర్పు ముగించిన పెదనాయుడిని తినేసేలా చూసింది మాలచ్చిమి మరోసారి!

"తప్పుసేసింది పాటక ఆ బాబు ఏపు ఎలా సూస్తుందో సూడు రంకుముండ!" అని ఆ ఊరి ప్రజంతా మహాలక్ష్మిని ముక్తకంఠంతో దుమ్మెత్తి పోస్తూంటే దర్పంగా మీసాలు దువ్వుకుంటూ చినసాయుడి భుజాలమీద చేతులేసి దర్జాగా వెళిపోతున్న పెదనాయుడి కాళ్ళమీద పడి "అంత సిట్టేసిస్తే మాం నెక్కడ కట్టుకోగలం బాంవూ కట్టుకోలేని మాంవు ఈ వూరొగ్గిని ఎక్కడికెలిపోవాల? ఊరికానూరిలో ఎలాగ బతకాల, రచ్చించండి దర్మపెబువులో... ఈ తూరి సెమించి వొగ్గియండి బాబో" అని నెత్తీ నోరు కొట్టుకుంటున్న మాలచ్చిమి తల్లిని పురుగుని విదిలించుకున్నట్టు విదిలించుకుని ముందుకు సాగిపోయారు నాయుళ్ళు! వాళ్ళ వెనకే వూరువూరంతా కదిలి వెళ్ళిపోయింది. ఇదంతా నిశ్శబ్దంగా చూస్తున్న మహాలక్ష్మి వాళ్ళు కనుచూపు దూరంలో వుంటుండగానే విసవిసా నడిచి రచ్చబండ దగ్గరకెళ్ళి ఆ బండమీద తల బాదుకు నేడుస్తున్న తల్లిని లేవదీసి... "వొల్లకో యమ్మ నువ్వెందుకేడుస్తావే తప్పు సేసినోళ్లే సిచ్చనుబవిత్తారు. ఇయ్యాలీ బండకాడ సాగిన తప్పుడిసారణకి ఈల్లకి నేసేస్తానోయమ్మ తప్పు. ఆడు సచ్చేంతవరకూ సెల్లించుకోలేడే ఆ తప్పుని. అంటూ ముగమనోహరంగా కనుపించే మహాలక్ష్మి ఎర్రబడిన కళ్లతో జేవురించిన మొహంతో తల్లిని తీసుకుని తన గూడెంవేపు సాగింది.

ఆ రాత్రికే మూటాముల్లె సర్దుకుంది మహాలక్ష్మి!

తెల్లారి వూరొగ్గిని ఎలిపోవాల కదా!

తెలతెల్లారుతుండగా ఎవరూ చూడకుండా చూసుకుని పెదనాయుడి కళ్ళంకోసారి వెళ్ళొచ్చింది మహాలక్ష్మి.

బాగా తెల్లారేసరికి మహాలక్ష్మి ఊరి శివార్లు దాటి బస్సుమెట్ట చేరుకుంది. పట్నం వెళ్ళే మొదటి బస్సు అందుకోడానికి తల్లితో సహా.

"తప్పు సెయ్యబట్టే సిచ్చనుబగించుకుంటూ వూరొగ్గి పెలిపోనాది గుడిసేటి ముండ" వూరూ వాడా మహలచ్చిమిని తిట్టుకుంది ఆ రోజంతా.

పట్నం వెళిపోయిన మహాలక్ష్మి ఏంచేసిందో ఎరుకదూరా?

పెదనాయుడి కళ్లంలో చినసాయుడికి దొరికిపోయిన ఆ రాత్రిలాంటి ఎన్నో రాత్రులనుంచి పట్నంనుంచి చదువుకొచ్చిన పెదనాయుడి కొడుకుతో ప్రణయకలాపాలు సాగించిన మహాలక్ష్మి తన అందంనుంచీ ఆకర్షణనుంచీ తప్పించుకోలేక తన దగ్గరకు పరుగెత్తుకొచ్చి తన వొడిలో వాలిపోయిన పెదనాయుడి కొడుకుని పబ్లిగ్గా రిజిస్ట్రారు ఆఫీసులో పెళ్ళిచేసుకుని పట్నంలో కాపరం పెట్టి తప్పుడు తీర్పిచ్చి ఊరి పదిమందిలో తన్ను అవమానం చేసిన పెదనాయుడికి జీవితాంతం అనుభవించే తప్పు వేసింది!